క్లుప్తంగా

పీజీ సెట్ వాయిదాకు వినతి



కన్వీనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నేతలు

తిరుపతి సిటీ : ఎస్వీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పీజీసెట్–2025ను డీఎస్సీ రాస్తున్న అభ్యర్థులకు నష్టం జరగకుండా వాయిదా వేయాలని ఏఐఎస్ఎఫ్, ఏఐఎస్ఎఫ్ నేతలు కోరారు. బుధవారం ఈ మేరకు పీజీసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ డీఎస్సీ షెడ్యూల్ కారణంగా అందే రోజు కొన్ని పీజీ సెట్ పరీక్షలు ఉండటంతో విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారన్నారు. డీఎస్సీఉన్న రోజున పీజీ పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. సానుకూలంగా స్పందించిన కన్వీనర్ ఈ అంశాన్ని చైర్మన్ దృష్టి తీసుకెళ్లామని, పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. నేతలు బండి చలపతి ,ఉద య్ కుమార్, ఓంరాజు, విష్ణు, గ్రేస్ పాల్గొన్నారు

తిరుపతి ఐకాన్‌గా తుడా టవర్స్



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న తుడా చైర్మన్ దివాకర్‌రెడ్డి

తిరుపతి తుడా : స్థానిక అన్నమయ్య సర్కిల్‌లో నిర్మిస్తున్న తుడా టవర్స్‌ను తిరుపతి ఐకాన్‌గా అభివృద్ధి చేస్తామని తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి తెలిపారు. బుధవారం అధికారులతో కలిసి ఆయన తుడా టవర్స్ నిర్మాణ పనులను పరిశీలించారు. తుడా టవర్స్‌ను 3.60 ఎకరాలలో నిర్మిస్తున్నామని, నాణ్యత ప్రమాణాలతో త్వర లో పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. నిబంధనలకు అనుగుణంగా నిర్మించా లని అధికారులకు సూచించారు. రైల్వే స్టేషన్, బస్టాండుకు సమీపంలో తుడా టవర్స్ ఉండ డంతో డిమాండ్ అధికంగా ఉందని, ఎక్కడ రాజీ పడకుండా నిర్ణీత గడువు లోపు అందుబాటులోకి తీసుకువస్తామని వెల్లడించారు.అనంతరం మామండూరులోని తుడా లే అవుట్ ను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో తు డా సెక్రటరీ డాక్టర్ ఎన్‌వీ శ్రీకాంత్, ఎస్ఈ కృష్ణారెడ్డి, ఈఈ రవీంద్ర, డీఈ బాషా, ఏఈ షణ్ముగం, కేపీసీ కాంట్రాక్టర్ సుశీల్ పాల్గొన్నారు.

జూలై 19 నుంచి నాటక పోటీలు



మాట్లాడుతున్న బీఎస్ రెడ్డి

తిరుపతి కల్చరల్ : టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ సహకారంతో జూలై 19 నుంచి 27వ తేదీ వరకు మహతి కళాక్షేత్రంలో హనుమ అవార్డ్స్ నాటక పోటీలు నిర్వహించనున్నట్లు అభినయ ఆర్ట్స్ కార్యదర్శి బీఎస్ రెడ్డి తెలిపారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. 32 పద్యనాటకాలు, 53 సాంఘిక నాటికలకు దరఖాస్తులు అందినట్లు వెల్లడించారు. ప్రాథమికంగా పరిశీలించి 8 పద్య , 10 సాంఘిక నాటకాలను ఎంపిక చేసినట్లు వివరించారు. నాటక పోటీలతోపాటు కూచిపూడి, భరతనాట్యం, జానపద బృంద, సోలో నృత్యాలు కూడా ఉంటాయన్నారు. ఆసక్తిగలవారు 9581154667 నంబర్‌లో సంప్రదించాలని కోరారు. సమావేశంలో అభినయ ఆర్ట్స్ ప్రతినిధులు మబ్బు సూర్యనారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇరమునిశేఖర్, ఏనుగల అంకమనాయుడు, కొణిదల శోభ, బాలాజీ పాల్గొన్నారు.

శ్మశానంలో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలను తొలగిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తిరుపతి మంగళం : మారుతీ నగర్ సీకామ్ కళాశాల వద్ద ఉన్న డంపింగ్‌యార్డ్ సమీపంలోని శ్మశాన స్థలంలో గోస్ట్ బిర్యానీ హోటల్ నిర్వాహకుల ఆక్రమణలను కార్పొరేషన్ అధికారులు బుధవారం తొలగించారు. 'శ్మశానంలో బిర్యానీ' శీర్షికతో సాక్షి పత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఆక్రమణలను జేసీబీతో తొలగించి శ్మశాన స్థలం వరకు ట్రెంచ్ తవ్వించారు. కబ్జాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.త్వరలోనే ఈ స్థలానికి ప్రహరీగోడ నిర్మించనున్నట్లు వెల్లడించారు.



తిరుపతి : భూమన అభినయ్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీలో మేయర్ శిరీష తదితరులు

'సూపర్ సిక్స్ పథకాలంటూ ప్రజలను నమ్మించారు. ఓట్లు వేయించుకుని వంచించారు. అధికారం చేపట్టిన ఏడాదిలో స్కామ్‌లకే పాలనను పరిమితం చేశారు. వైఎస్సార్‌సీపీ నేతలపై అక్రమంగా కేసులు నమోదు చేయిస్తున్నారు. ఇష్టారాజ్యంగా దాడులకు పాల్పడుతున్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు. బూటకపు హామీలతో జనం చెవిలో పువ్వులు పెట్టారు. ప్రశ్నించిన వారిని వేధించడమే పనిగా పెట్టుకున్నారు' అని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, పార్టీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త అభినయ్‌రెడ్డి, చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి ఆరోపించారు. బుధవారం తిరుపతి, చంద్రగిరి అసెంబ్లీ సెగ్మెంట్ల పరిధిలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై వెన్నుపోటు దినం చేపట్టారు. అశేషంగా హాజరైనా నేతలు, కార్యకర్తలు, ప్రజలతో కలిసి సర్కార్.. ఖబడ్దార్ అంటూ హెచ్చరికలు జారీ చేశారు.

సర్కార్.. ఖబడ్దార్

- చంద్రబాబు బూటకపు హామీలతో ప్రజలకు వెన్నుపోటు పొడిచారు
- ఏడాది పాలనలో అభివృద్ధి ఊసేలేదు.. అంతా అరాచకమే
- టీడీపీది మోసకారి మేనిఫెస్టో
- వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన
- ర్యాలీలతో కదం తొక్కిన అభినయ్‌రెడ్డి, మోహిత్‌రెడ్డి
- వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'వెన్నుపోటు దినం'
- పోటెత్తిన నేతలు, కార్యకర్తలు, ప్రజలు

తిరుపతి మంగళం/ చంద్రగిరి : మోసం, దుర్మార్గం, కపటం, కుట్ర, కుతంత్రంతో కలబోసిందే కూటమి ప్రభుత్వమని వైఎస్సార్‌సీపీ తిరుపతి, చిత్తూరు జిల్లాల అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి మండిపడ్డారు. అధికార దాహంతో నోటికి వచ్చిన అబద్ధపు హామీలు గుప్పించి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి చేసుకుందన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల్లో ఇంతవరకు ఏఒక్కటి నెరవేర్చలేదని స్పష్టం చేశారు. అందుకే వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు బుధవారం కూటమి వెన్నుపోటు దినంగా పాటిస్తున్నామని, నిరసన ర్యాలీ చేపట్టి తిరుపతి ఆర్డీఓకు వినతిపత్రం సమర్పించామన్నారు. ముందుగా తిరుపతి జీవకోన మార్గంలోని సత్యనారాయణపురం సర్కిల్ నుంచి తిరుమల బైపాస్‌రోడ్డులోని మున్సిపల్ పార్క్ వరకు సుమారు 5వేల మందితో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. కరుణాకరరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మోసపూరిత హామీలనే చంద్రబాబు అస్త్రాలుగా వాడుకుని ప్రజలను నమ్మించి అధికారంలోకి వచ్చిన తర్వాత వంచించారని ఆరోపించారు. ఏడాది పాలనలో ప్రజలకు ఇచ్చిన సూపర్‌సిక్స్ హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదన్నారు. కేవలం వైఎస్సార్‌సీపీ నేతలపై కక్ష సాధింపులకు పాల్పడుతూ అక్రమ కేసులు బనాయించి జైళ్లకు పంపడమే పనిగా పెట్టుకున్నారని మండిపడ్డారు. ఇప్పటికే 2,466 మందిపై దాడులు చేసి, అక్రమ కేసులను బనాయించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో సుమారు 375మందిని హత్య చేశారని ఆరోపించారు. అయితే చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌ల బెదిరింపులకు జడిసే వాళ్లు ఎవరూ లేరని స్పష్టం చేశారు. ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డికి, చంద్రబాబుకు నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉందన్నారు. జగన్ చెప్పిందానికంటే కూడ ఎక్కువ సంక్షేమ పథకాలను అందించిన గొప్ప నాయకుడని, చంద్రబాబుది మోసపూరిత హామీలే తప్ప వాటిని నెరవేర్చిన దాఖలాలు లేవని తెలిపారు. ఏడాదిలోనే ప్రజలు ఇంత పెద్ద స్థాయిలో తిరగబడుతున్నారంటే కూటమి ప్రభుత్వంపై జనాగ్రహం అర్థమవుతోందని వెల్లడించారు. మేయర్ డాక్టర్ శిరీష మాట్లాడుతూ అబద్ధాలు చెప్పడం చంద్రబాబు నైజమైతే, ఇచ్చిన హామీలకు కట్టుబడి అంత కంటే ఎక్కువ సంక్షేమ పథకాలను అందించడం జగనన్న మంచి మనసుకు తార్కాణమని వివరించారు. భూమన అభినయ్‌రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, లక్షల ఉద్యోగాలు, ఉచిత బస్సు, బీసీలకు పెన్షన్, ఏడాదికి నాలుగు గ్యాస్ సిలిండర్లు, రైతు సాయం ఇలా అనేక సంక్షేమ పథకాలను అందిస్తానని నమ్మబలికి ఏ ఒక్కటైనా నెరవేర్చారా చంద్రబాబు అని ప్రశ్నించారు. కూటమి పాలనలో మద్యం ఏరులై పారుతోందన్నారు. ఆధ్యాత్మిక నగరంలో 24గంటలు మద్యం విక్రయిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ చేపట్టిన ఉద్యమంతోనే కూటమి ప్రభుత్వం దిగి వచ్చిందని, పర్మిట్ రూములు, బెల్టుషాపులు లేకుండా చేసిన ఘనత మనకే దక్కుతుందన్నారు. ప్రజాసంక్షేమం కోసం ప్రభుత్వ వ్యతిరేక విధానాలపైనిరంతరం ఉద్యమ పోరాటాలు సాగిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న భూమన కరుణాకరరెడ్డి, పక్కన ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం

ఇక కూటమికి పతనమే!

వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపుమేరకు చంద్రగిరిలో పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు కదం తొక్కారు. పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 10.30గంటలకు క్లాక్‌టవర్ వద్ద ప్రారంభమైన ర్యాలీ 12గంటలకు తహసీల్దారు కార్యాలయానికి చేరుకుంది. మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ఏడాదికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందన్నారు. ఇక కూటమికి పతనం తథ్యమని స్పష్టం చేశారు. పిల్లలను మభ్యపెడుతూ ఎన్నికల సమయంలో నీకు 15వేలు.. నీకు 15వేలు.. మరి నీకు 18వేలు.. అంటూ మైకులు పగిలేలా ప్రచారం చేసిన కూటమి నేతలు ఆయా వర్గాల వారికి వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రజల పక్షాన నిలబడి ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నేతలపై రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇసుక, మట్టి, మద్యం, భూ మాఫియాలను నడిపిస్తూ దోపిడీకి పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ శివ రామసుబ్బయ్యకు వినతిపత్రం అందించారు.



చంద్రగిరి : మోహిత్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, ప్రజల ర్యాలీ



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న మోహిత్‌రెడ్డి, తదితరులు

ఈఎస్ఐ, ఈపీఎఫ్‌పై అవగాహన



మాట్లాడుతున్న స్విమ్స్ డైరెక్టర్ ఆర్‌వీ కుమార్

తిరుపతి తుడా : స్విమ్స్‌లో పనిచేస్తున్న ఎస్ఎల్ఎస్ ఎంపీసీ కార్పొరేషన్ ఉద్యోగులకు ఈఎస్ఐ, ఈపీఎఫ్‌పై బుధవారం అవగాహన కల్పించారు. స్విమ్స్ డైరెక్టర్, వీసీ డాక్టర్ ఆర్‌వీ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు, కార్మికులకు బాధ్యతలతో పాటు హక్కులపై అవగాహన అవసరమన్నారు. ఈఎస్ఐ, ఈపీఎఫ్‌లలో సభ్యులుగా చేరిన వారికి అనేక లాభాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రీజినల్ పీఎఫ్ కమిషనర్ బీటీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులకు ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాను ఉంటుందని, వారి వేతనాల నుంచి కొంత మొత్తం పీఎఫ్ ఖాతాకు చేరుతుందన్నారు. అలాగే సదరు సంస్థ సైతం పెన్షన్ స్కీమ్‌తో పాటు పీఎఫ్ ఖాతాకు నగదు జమ చేస్తుందని, ఖాతాదారులు ఉద్యోగ విరమణ చేసిన తర్వాత పెన్షన్ బెనిఫిట్స్ ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో పీఎఫ్ అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, జీఎం రవీంద్రబాబు, ఎంప్లాయీస్ జనరల్ సెక్రటరీ మురళీధర్, మెంబర్ ఫర్ రీజినల్ అడ్వైజర్ కమిటీ నేషనల్ బోర్డు ఫర్ వర్కర్స్ ఎడ్యుకేషన్ అండ్ డెవలప్‌మెంట్ అధికారి లేబూరి రత్నకుమార్ పాల్గొన్నారు

విశ్రాంత ఉద్యోగి 'యాత్ర'



గణేష్‌కుమార్‌కు స్వాగతం పలుకుతున్న దృశ్యం

తిరుపతి కల్చరల్ : కేంద్ర ప్రభుత్వ విశ్రాంత అధికారి జీవీ గణేష్ కుమార్ చేపట్టిన సైకిల్ యాత్ర బుధవారం మధ్యాహ్నం తిరుపతికి చేరుకుంది. మే 30 ఉదయం 5.30 గంటలకు హైదరాబాద్ నుంచి సైకిల్‌పై బయలుదేరిన ఆయన సుమారు 600 కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతికి వచ్చారు. కరకంబాడి రోడ్డులో ఆయనకు పలువురు విశ్రాంత ఉద్యోగులు స్వాగతం పలికారు. అనంతరం గణేష్‌కుమార్ తిరుమల శ్రీవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. విశ్రాంత ఉద్యోగులు రాణాప్రతాప్‌సింగ్, రిజి.రామకృష్ణ, గొల్లపల్లి శ్రీనివాసులు, ట్రావెల్స్ యజమాని ఎంఎం కుమార్ ఉన్నారు.

వ్యాసరచన, వక్తృత్వ పోటీలు



పోటీలను ప్రారంభిస్తున్న సురేంద్రబాబు, వివేక్ తదితరులు

తిరుపతి సిటీ: పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ పోటీలను బుధవారం ఎస్వీయూ స్టూడెంట్ వెల్ఫేర్ అండ్ కల్చరల్ అఫైర్స్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు. వర్సిటీ గ్రంథాలయ డైరెక్టర్ ప్రొఫెసర్ కొంగర సురేంద్రబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని కోరారు. కల్చరల్ అఫైర్స్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్ చౌదరి మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. విజేతలకు పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నాడు బహుమతులు, సర్టిఫికెట్లు, జ్ఞాపికలు అందించనున్నట్లు వెల్లడించారు.

ప్లాస్టిక్‌పై కఠినంగా నిషేధం



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : పర్యావరణానికి హాని చేసే ప్లాస్టిక్ సామగ్రిపై కఠినంగా నిషేధం అమలు చేస్తున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ మౌర్య స్పష్టం చేశారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో చాంబర్ ఆఫ్ కామర్స్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ 120 మైక్రాన్లకు తక్కువగా ఉన్న ప్లాస్టిక్, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించామన్నారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ, జ్యూట్ సంచులు, ఇతర రీసైక్లబుల్ సామగ్రిని వాడుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ మేరకు ప్రజలు సైతం సహకరించాలని సూచించారు. ప్లాస్టిక్ బీట్ – ప్లాస్టిక్ పొల్యూషన్‌ను మూడు నెలల్లోపు నగరంలో పూర్తి స్థాయిలో అమలు చేసేందుకు కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. అలాగే దుకాణదారులు, మాల్స్ యజమానులు అందరూ ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలని స్పష్టం చేశారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎస్ఈ శ్యామ్‌సుందర్, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ సేతుమాధవ్ పాల్గొన్నారు.

నోటీస్ బోర్డు

- శ్రీగోవిందరాజస్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు కల్పవృక్ష వాహనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు సర్వభూపాల వాహన సేవ.
- ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఏపీజీ అండ్ బీసీ చైర్మన్ ఆధ్వర్యంలో ఉదయం 8 గంటలకు సీతమ్మ రోడ్డులో మొక్కలు నాటే కార్యక్రమం.
- తిరుచానూరులోని శ్రీసూర్యనారాయణ స్వామి ఆలయంలో సాయంత్రం 5 గంటలకు తిరుచ్చి ఉత్సవం.

గంగమ్మకు సారె సమర్పణ



సారె తీసుకెళుతున్న మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్ (రామచంద్రాపురం) : రామచంద్రాపురం మండలం అనుప్పల్లెలో గంగమ్మ జాతర ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఈ మేరకు అమ్మవారికి వైఎస్సార్‌సీపీ చంద్రగిరి నియోజకవర్గ సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సారె సమర్పించారు. ఈక్రమంలో మోహిత్‌రెడ్డికి గ్రామస్తులు, మహిళలు ఘనంగా స్వాగతం పలికారు. నడివీధి గంగమ్మ ఆలయానికి చేరుకుని గ్రామ పెద్దలకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సారెను అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎద్దుల చంద్రశేఖర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, గోవర్ధన్, శశికాంత్, కోటి, మధు పాల్గొన్నారు.

కబ్జాకు యత్నిస్తే కఠిన చర్యలు

తిరుపతి మంగళం : ప్రభుత్వ భూములను కబ్జా చేసేందుకు యత్నిస్తే కఠిన చర్యలు తప్పవని తిరుపతి అర్బన్ తహసీల్దార్ భాగ్యలక్ష్మి హెచ్చరించారు. మంగళంలోని న్యూ మంగళం పంచాయతీ 114/2 సర్వే నంబర్‌లో సుమారు రూ. 20 కోట్లు విలువ చేసే రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని కొందరు ఆక్రమణదారులు చదును చేసి అందులో లేవుట్ వేసి రాళ్లు నాటారు. బుధవారం ఈ మేరకు విషయం తెలియడంతో తహసీల్దార్ వెంటనే చర్యలు చేపట్టారు. ఆమె ఆదేశాల మేరకు వీఆర్‌ఓలు సతీష్, ప్రసాద్ అక్కడకు వెళ్లి ప్రభుత్వ భూమిలో వేసిన లేవుట్ రాళ్లను తొలగించారు. మరోసారి ఇందులో ఆక్రమణలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.



ఆక్రమిత భూమిలో వేసిన లేఅవుట్